సాక్షి
నిజామాబాద్
గురువారం । 5 । డిసెంబర్ । 2024



ప్రజలను వంచించి పాలన

కాంగ్రెస్ ప్రజలను వంచించి ఏడాది పాలన పూర్తి చేసుకుందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు.

- 8లో ▸



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని..

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని విజయోత్సవ పర్యవేక్షకుడు వేణు గోపాలాచారి కోరారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.5 /20.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అటవీ సంపద పరిరక్షణకు కృషి చేయాలి



మోపాల్: అటవీ సంపద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిజామాబాద్ సౌత్ రేంజ్ ఎఫ్ఆర్‌వో రాధిక సూచించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మంచిప్ప అటవీ ప్రాంతంలో పాఠశాల విద్యార్థులకు వన దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల చెట్లు, వాటి ఉపయోగాలను వివరించారు. పర్యావరణ సమతుల్యతకు వన్యమృగాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాధిక తెలిపారు. అనంతరం విద్యార్థులకు వన్యమృగాల సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు వెంకట్రామ్, పాఠశాల హెచ్‌ఎం సాయిలు, దేవేందర్, జై భారత్ యూత్ అధ్యక్షుడు సాయిరాం, సెక్షన్ ఆఫీసర్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



తెయూ(డిచ్‌పల్లి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అన్నారు. తెయూలో యాంటీ ర్యాగింగ్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. ర్యాగింగ్ పేరుతో సీనియర్లు జూనియర్ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తే నేరంగా పరిగణిస్తామన్నారు. ర్యాగింగ్ చేసినట్లు తేలితే విద్యాసంస్థల నుంచి తొలగిస్తారని, దీంతో భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ప్రస్తుతం సాంకేతికత బాగా పెరిగిందని, దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెయూ యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె ర వీందర్ రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి పర్యటన వాయిదా

నిజామాబాద్ అర్బన్: మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటన వాయిదా పడింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఆయన గురువారం పర్యటించాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రశాంతంగా న్యాస్ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా లో బుధవారం న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. వివిధ మండలాల నుంచి 180 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 3058 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా పరీక్ష పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు.

నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు

డిచ్‌పల్లిలో డ్రైపోర్టు, 100 పడకల ఆస్పత్రి, గుండారం వద్ద పారిశ్రామిక జోన్‌కు ప్రతిపాదనలు



ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి

- తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలకు ప్రయత్నాలు
- ఇందల్వాయిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు ప్రక్రియ
- అన్ని మండలాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్
- ఏడు చెక్‌డ్యాంలకు టెండర్లు పూర్తి
- రూ.36 కోట్లతో పాఠశాలలు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులు పూర్తి
- రోడ్లు, వంతెనలకు ఆర్అండ్‌బీ ద్వారా రూ.60 కోట్ల టెండర్లు.. మరో రూ.250 కోట్లతో ప్రతిపాదనలు
- 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల మంజూరు.. 133/33 స్టేషన్ల కోసం ప్రతిపాదనలు
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

నిజామాబాద్ నగరం చుట్టూ రూ.2 వేల కోట్ల అంచనాతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించేందుకు, డిచ్‌పల్లి వద్ద డ్రైపోర్టు ఏర్పాటుకు, గుండారం వద్ద ఇండస్ట్రియల్ జోన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టానన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూలో భూపతిరెడ్డి పలు విషయాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ధాన్యం, మొక్కజొన్న, సోయా, పసుపు, ఎర్రజొన్న తదితర పంటలను జిల్లా నుంచి నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు గాను డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద 200 ఎకరాల్లో డ్రైపోర్టు, నగరానికి ఆనుకుని ఉన్న గుండారం వద్ద పారిశ్రామిక జోన్ ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. ఇక ప్రతిపాదనలు పంపిన ఔటర్ రింగ్ రోడ్డు విషయమై ఎస్టిమేట్స్ తయారు చేస్తున్నాం. అలాగే గూపన్‌పల్లి వద్ద క్రీడా కాంప్లెక్స్ కోసం ప్రతిపాదనలు పంపడంతో పాటు 10 ఎకరాల స్థలం ఇవ్వాలని రెవెన్యూ శాఖకు చెప్పాను. ఇక నిజామాబాద్ మాస్టర్ ప్లాన్ సైతం మార్చేందుకు ప్రతిపాదనలు చేశాం.

■ నియోజకవర్గంలో కొత్త రోడ్లు, వంతెనల కోసం ఆర్అండ్‌బీ మంత్రి ద్వారా రూ.60 కోట్లు మంజూరయ్యాయి. వీటికి టెండర్లు పూర్తయ్యాయి. అదేవిధంగా మరిన్ని రోడ్లు, వంతెనల కోసం రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపించాను. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్లకు మరో రూ.40 కోట్లు వచ్చాయి. వీటికి త్వరలో టెండర్లు నిర్వహిస్తాం. రోడ్ల మరమ్మతుల కింద మరో రూ.10 కోట్లు మంజూరు చేయించాను.

■ రూ.10 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు వచ్చాయి. ఇందులో రూ.2 కోట్లు పాఠశాలల అభివృద్ధికి, రూ.కోటి తాగునీటికి, రూ.7 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు, రోడ్ల పనులు పూర్తి చేశాం. మరో రూ.6 కోట్ల ఈజీఎస్ నిధులతో డ్రెయిన్లు, సీసీ రోడ్లు పూర్తి చేశాం. ఇక ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్లు, డ్రెయిన్ల కోసం మరో రూ.10 కోట్లు వచ్చాయి.

■ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, తండా నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు కనెక్టివిటీ, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు నాలుగు లేన్ల రోడ్డు కోసం కృషి చేస్తున్నాం. మరోవైపు ఎస్సీ సబ్ ప్లాన్ కింద డ్రెయిన్ల కోసం రూ.10 కోట్లతో, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రోడ్ల కోసం రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. 15 గ్రామపంచాయతీ భవనాల కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదించాను.

■ తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కళాశాలల కోసం అడిగితే ముఖ్యమంత్రి అంగీకరించారు. అదేవిధంగా తెయూలో సైన్స్ భవనం, బాలికల హాస్టల్, ఆడిటోరియం ప్లాన్ చేశాం. ఇండోర్ స్టేడియం పనులు నడుస్తున్నాయి.

■ ప్రాణహిత–చేవెళ్ల 21, 21ఏ ప్యాకేజీ పనులను రెండేళ్లలో పూర్తి చేసి 1.82 లక్షల ఎకరాలకు నీరందిస్తాం. రామడుగు, ఇందల్వాయి, మంచిప్ప చెరువుల పంట కాలువలకు లైనింగ్ చేసేందుకు ప్రతిపాదనలు చేశాం. గడ్కోల్, నల్లవెల్లి, గొరారం, రాంపూర్, కేశవాపూర్, చిన్నతాడెం చెక్‌డ్యాంలకు టెండర్లు పూర్తి చేశాం. తూంపల్లి చెక్‌డ్యాంకు టెండర్లు పిలుస్తాం. గుత్ప ఎత్తిపోతల ఆయకట్టును పెంచి జక్రాన్‌పల్లి మండలంలోని 5 గ్రామాలకు సాగునీరిస్తాం.

■ అర్గుల్, ఇందల్వాయి వద్ద మోటార్లు, పైపులైన్ల కోసం రూ.2 కోట్లు వెచ్చించాం. అమృత్ స్కీం కింద నిజామాబాద్ నగరపాలక విలీన గ్రామాలకు తాగునీరు అందించేందుకు 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో 8 ట్యాంకుల నిర్మాణానికి నిధులు వచ్చాయి.

■ మోపాల్, గుండారం బస్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు పంపించాం. అటవీ, అబ్కారీ పరిధులను రీఆర్గనైజ్ చేసేందుకు సైతం ప్రదిపాదించాం.

■ ఇందల్వాయి వద్ద హైవే పక్కన రోడ్డు ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్యసేవల కోసం ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రక్రియ నడుస్తోంది. డిచ్‌పల్లిలో 100 పడకల ఆస్పత్రి కోసం, జక్రాన్‌పల్లి, సిరికొండ, మోపాల్ పీహెచ్‌సీలను అడ్వాన్స్‌డ్ పీహెచ్‌సీలుగా 30 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. ధర్పల్లిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణంలో ఉంది. సిరికొండ మండలం చీమన్‌పల్లిలో పీహెచ్‌సీ కోసం రెవెన్యూ శాఖను 2 ఎకరాల భూమి అడిగాం.

■ తిర్మన్‌పల్లి, తాటిపల్లి, న్యాల్‌కల్, డీబీ తండా వద్ద 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం రూ.12 కోట్లు మంజూరు అయ్యాయి. ఇక కేశ్‌పల్లి, హుస్సేన్‌నగర్, సుద్దులం వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు పంపాం. అలాగే జక్రాన్‌పల్లి, ధర్పల్లి వద్ద 133/33 సబ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు పంపాం. మరోవైపు రైతుల సౌకర్యం కోసం డిచ్‌పల్లి, ధర్పల్లి వద్ద సర్వీస్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు పంపాం.

■ డిచ్‌పల్లి మండలం సుద్దులం వద్ద 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌కు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి లేదా ఇన్‌చార్జి మంత్రితో శంకుస్థాపన చేయిస్తాం. అన్ని మండలాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయిస్తాము. రూ.2 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో పాఠశాలల పనులు చేయించాము. రూ.1 కోటితో పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశాం. అంగన్‌వాడి కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలతో అనుసంధానం చేస్తున్నాం. డిచ్‌పల్లిలో డిగ్రీ కళాశాల కోసం 5 ఎకరాల స్థలం చూశాం. ఇక సిరికొండలో స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) ఏర్పాటుకు 5 ఎకరాలు గుర్తించాం. ఆదర్శ పాఠశాలల మౌలిక సదుపాయాల కోసం రూ.10 కోట్లు రాగా పనులు పూర్తి చేశాం.

సరుకుల నాణ్యత పరిశీలించి వంట చేయాలి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



పాఠశాలలో అన్నం పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఆర్మూర్: గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో సరుకుల నాణ్యత పరిశీలించిన తర్వాతే వంట చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఆర్మూర్ పట్టణం పిప్రి సమీపంలోని ఆర్మూర్, వేల్పూర్ బాలుర గురుకుల పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ రెండు పాఠశాలలు ఒకే ప్రాంగణంలో కొనసాగుతుండగా కలెక్టర్ పరిశీలించి వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారంగానే ఉన్నాయా అని తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విజయ డైరీ పాలను వినియోగించాలని, రాత్రి సమయంలో ఏఎన్ఎం, వాచ్‌మన్‌తో పాటు పర్యవేక్షణ కోసం ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా వసతి గృహంలోనే బస చేయాలన్నారు. నీటి సంపు, వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అవుతున్నాయా అని ఆరా తీశారు. రెండు గురుకులాల్లో ఆర్‌వో వాటర్ ప్లాంట్లు లేవని నిర్వాహకులు తెలుపగా, వాటిని ఏర్పాటు చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆర్మూర్ తహసీల్దార్ గజానన్ ఉన్నారు.

జిల్లాలో 94.2 శాతం సర్వే పూర్తి

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే తుది దశకు చేరింది. బుధవారం వరకు 94.20 శాతం సర్వే పూర్తయింది. గత నెల 9న ప్రారంభమైన సర్వే ఇంకా కొనసాగుతుంది. గతంలో సర్వే సమయంలో అందుబాటులో లేని కుటుంబాల వివరాలు ప్రస్తుతం సేకరిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వంద శాతం సర్వే పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

హిందువులపై దాడి అమానుషం



మాట్లాడుతున్న విశ్వ హిందూ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం

నిజామాబాద్ రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని ఉమ్మడి రాష్ట్రాల విశ్వ హిందూ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం అన్నారు. బుధవారం నగరంలోని ధర్నాచౌక్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంఘీభావ సభ నిర్వహించారు. దేశంలో హిందువులు సంఘటితం కావాలన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందువులపై దాడి చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదు నిమిషాలు దేశ భద్రత బలగాలను బంగ్లాదేశ్‌కు పంపితే ఆ దేశం రూపురేఖలు లేకుండా పోతుందన్నారు. హిందువులు ఐకమత్యంగా ఉండి సనాతన ధర్మాన్ని, ఆలయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ గురుచరణ్, మల్లారం పిట్ల కృష్ణ మహరాజ్, కంఠేశ్వర్ ఇస్కాన్ రామానందరాయి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, సాయి ప్రసాద్, నరేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, మాదాస్ స్వామీ యాదవ్, పోతనకర్ లక్ష్మీనారాయణ, శివకుమార్, శంకర్, తమ్మల కృష్ణ, గాజుల దయానంద్, రెబ్బ ఆనంద్, నాంపల్లి శేఖర్, దాత్రిక రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యం చేరని చేపపిల్లల పంపిణీ

- జిల్లాలో 2.27 కోట్లకు 1.92 కోట్లే విడుదల
- ఆందోళనలో మత్స్యకారులు



సోన్‌పేట్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న అధికారులు (ఫైల్)

బాల్కొండ: జిల్లాలోని చెరువుల్లో లక్ష్యం మేరకు చేపపిల్లలన వదలలేదు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 967 చెరువుల్లో చేపపిల్లలను వదలాల్సి ఉండగా 730 చెరువుల్లోనే వదిలారు. మొత్తం 2.27 కోట్ల చేప పిల్లల విడుదలకు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 1.92 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. పూర్తిగా చేపపిల్లలను వదలకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో నాలుగు కోట్ల చేపపిల్లలను అవసరం. కానీ ప్రభుత్వం 2.27 కోట్ల పిల్లల విడుదలకు నిర్ణయించింది. అందులో కూడా కోత పెట్టడంపై మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయిన సీజన్

ప్రస్తుత సంవత్సరం చెరువుల్లో చేప పిల్లలను వదిలే సీజన్‌ను ప్రభుత్వం క్లోజ్ చేసింది. గత నెల 10 వరకు మాత్రమే చేప పిల్లలను వదిలేందుకు అవకాశం ఇచ్చారు. అప్పటికీ 50 శాతం కూడా విడుదల పూర్తి కాకపోవడంతో మళ్లీ 25 వరకు పెంచారు. గత నెల 25 నాటికి సీజన్ క్లోజ్ చేస్తూ ప్రభుత్వం మత్స్య పోర్టల్‌ను మూసి వేసింది. దీంతో ప్రస్తుతం చేపపిల్లలను వదిలే అవకాశం లేకుండా పోయింది.

పత్తా లేని రొయ్యల సీడ్

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో గత ప్రభుత్వ హయాంలో 62 లక్షల చేప పిల్లలు వదిలేవారు. ప్రస్తుతం అందులో సగమే విడుదల చేశారు. రొయ్యల సీడ్ అయితే పత్తాలేకుండా పోయింది. రొయ్యల సీడ్‌కు ఈ ఏడాది ప్రభుత్వం మంజూరు కూడా ఇవ్వలేదు. దీంతో ప్రాజెక్ట్‌లో సగం చేప పిల్లలతోనే సరిపెట్టారు.

రాష్ట్రంలో నాలుగో స్థానం

ప్రస్తుత సంవత్సరం చేపపిల్లలను వదిలే సీజన్‌ను క్లోజ్ చేశాం. గత నెల 25 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. జిల్లాలో 730 చెరువుల్లో చేపపిల్లలను వదిలాం. చేపపిల్లల పంపిణీలో రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచాం. – అంజనేయులు, మత్స్యశాఖ ఏడీ, నిజామాబాద్

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా విపుల్‌గౌడ్



- వీడిన రెండున్నర నెలల ఉత్కంఠ



నరాల నిహార్



విపుల్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా తాళ్ల విపుల్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ కేంద్ర నాయకత్వం ఇందుకు సంబంధించిన ఫలితాలను బుధవారం విడుదల చేసింది. సభ్యత్వాలతో పాటు ఎన్నికల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలోనే జరిగింది. విపుల్‌గౌడ్ మరో పోటీదారు నాగేందర్‌పై 140 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నాగేందర్ బాబు, శ్రీకాంత్, సాయికిరణ్, అద్నాన్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఇర్ఫాన్ గెలిచారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆశల మహేందర్, అర్బన్ అధ్యక్షుడిగా మహ్మద్ ఇర్ఫాన్, బోధన్ అధ్యక్షుడిగా కార్తీక్ యాదవ్, బాల్కొండ అధ్యక్షుడిగా చరణ్‌గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన విక్కీ యాదవ్, నరాల నిహార్ ఎన్నికయ్యారు. కాగా ఈ ఎన్నికలు ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 14 వరకు ఆన్‌లైన్ విధానంలో జరిగాయి.

విద్యార్థి దశ నుంచి..

విపుల్‌గౌడ్ విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ భావజాలంతో పనిచేశారు. 2009లో విద్యార్థి సంఘం కళాశాల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2010లో ఎన్ఎస్‌యూఐ కళాశాల అధ్యక్షుడిగా, 2011లో జిల్లా ఉపాధ్యక్షుడిగా, 2014లో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2016లో కాంగ్రెస్ శక్తి ప్రాజెక్టు జిల్లా బాధ్యుడిగా వ్యవహరించారు. 2017లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 2019 నుంచి 2024 వరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారు.

వ్యాక్సిన్ తిప్పలు!



వ్యాక్సిన్ కోసం నిరీక్షిస్తున్న బాలింతలు, గర్భిణులు

ఆర్మూర్ టౌన్: టీకాల కోసం గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సిన్ సరఫరా చేస్తోంది. వీటిని ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు వేస్తారు. అయితే ఆర్మూర్‌లోని రాజారాంనగర్‌లో టీకాలు వేయడానికి స్థలం లేక ఆరుబయట వేస్తున్నారు. దీంతో మహిళలు ఎండలో నిరీక్షిస్తున్నారు. గతంలో కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో గల అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది టీకాలు వేసేవారు. అక్కడ టీకాలు వద్దని పాఠశాల ఉపాధ్యాయులు చెప్పడంతో సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో వేస్తున్నారు. అయితే అక్కడ స్థలం సరిపోకపోవడంతో ఇలా ఆరుబయట వ్యాక్సిన్ కోసం మహిళలు ఎదురు చూస్తు ఇబ్బందులు పడుతున్నారు. టీకాలు వేయడానికి ఒక గదిని కేటాయించాలని హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ కోరారు.



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పోలింగ్ బూత్‌ల గుర్తింపు

- జాబితా సిద్ధం చేయాలని ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల సంఘం



భీమ్‌గల్ మండలం ముచ్కూర్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మోర్తాడ్(బాల్కొండ): స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం ప్రకటించకపోయినా రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు పెట్టినా సిద్ధంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా పోలింగ్ బూత్‌ల గుర్తింపునకు ఉత్తర్వులను జారీ చేసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పంచాయతీ పోలింగ్‌కు ఎంతో తేడా ఉంటుంది. దీంతో బూత్‌ల వివరాలు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పోలింగ్ బూత్‌లను గుర్తించడం, జాబితాలను సిద్ధం చేయడానికి పంచాయతీ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్తగా ఏర్పడిన పంచాయతీలు మరో 10 వరకు ఉన్నాయి. వార్డుల వారిగా పోలింగ్ బూత్‌లను గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పోలింగ్ బూత్‌లు నిర్వహించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, కూల్చడం జరిగితే కొత్త భవనాల్లో బూత్‌లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 16 వరకు ఎన్నికల సంఘం సూచించిన విధంగా పోలింగ్ బూత్‌ల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీలతో సమావేశాలు, జిల్లా అధికార యంత్రాంగం ఆమోదం తదితర ప్రక్రియలు పూర్తి చేసి 17న తుది జాబితాను ప్రకటించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. పంచాయతీల్లో వార్డుల సంఖ్య ప్రకారం పోలింగ్ బూత్‌లను గుర్తించాల్సి ఉంది.

జాబితా సిద్ధం చేస్తున్నాం

పోలింగ్ బూత్‌లను గుర్తించి జాబితాలను సిద్ధం చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని బూత్‌లను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. రాజకీయ పార్టీల సహకారం తీసుకొని ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. – తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

క్లుప్తంగా

జాతీయ స్థాయి కరాటేలో ప్రతిభ



డిచ్‌పల్లి: వరంగల్ జిల్లాలో నిర్వహించిన రెండో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాల/ కళాశాలకు చెందిన వినీత తృతీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ దశరథ్ తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వినీతను ప్రిన్సిపాల్ దశరథ్, కోచ్ బిందు, ఉపాధ్యాయులు అశోక్, మహేశ్, రాణి, శ్రీనిజ, సుష్మ, కుల్దీప్, గంగాప్రసాద్, చిత్ర, పీడీ సంజీవ్ అభినందించారు.

7న ఆటోల బంద్

నిజామాబాద్ సిటీ: ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 7న చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతంచేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.12 వేల భృతి ఇస్తామని ప్రకటించి ఇవ్వడం లేదన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధికి నష్టం వాటిల్లిందన్నారు. అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలన్నారు. కటారి రాములు, అబ్దుల్ ముజీబ్, సయ్యద్ రఫీయొద్దీన్ పాల్గొన్నారు.

పసుపులో దుంపకుళ్లు నివారణ చర్యలు చేపట్టాలి

కమ్మర్‌పల్లి: పెనుగల్ తుపాను కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, దీనికారణంగా పసుపు పంటకు దుంపకుళ్లు, దుంప పుచ్చు, ఆకు మీద మచ్చలు వ్యాపించే అవకాశం ఉందని కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెగుళ్ల నివారణకు ఫిప్రొనిల్ లేదా మోనోక్రోటోపాస్ మందును ఎకరానికి అర లీటర్ పిచికారీ చేస్తే దుంప పుచ్చు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. దుంపకుళ్లు నివారించేందుకు రెడోమిల్ గోల్డ్ అనే మందును కాండం వద్ద దుంపకు తాకే విధంగా పిచికారీ చేయాలని, మర్రాకు తెగులు నివారణకు ప్రోపీకోనజోల్‌ను ఎకరానికి 300 మిల్లీ లీటర్ పిచికారీ చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా ఎర్రగుంటూరు రకం పసుపు సాగు చేస్తున్న నేపథ్యంలో పంట కాలవ్యవధి 8 నుంచి 9 నెలల పడుతుందన్నారు. జనవరి 15 తర్వాతే పంట కోత చేపట్టాలన్నారు. వివరాలకు పరిశోధన స్థానంలో సంప్రదించాలని సూచించారు.

కారు ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో సుద్దపల్లికి చెందిన ఖాసీం బీ అనే వృద్ధురాలికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఖాసీం బీ సుద్దపల్లి వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా ఆర్మూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టిందన్నారు. ఖాసీం బీ ఎడమ చేయి విరిగిందని, కారును ఆపకుండా డ్రైవర్ పరారయ్యాడన్నారు. బాధితురాలి మనవడు ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశాం
- నాలుగేళ్లలో హామీలన్నీ నెరవేరుస్తాం
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- సంక్షేమ పథకాలు అందనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా పర్యవేక్షకుడు సముద్రాల వేణుగోపాలాచారి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వేణుగోపాలాచారి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో ప్రజాఆశీర్వాదం కోసం వచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని ప్రజాపాలన విజయోత్సవ పర్యవేక్షకుడు సముద్రాల వేణుగోపాలాచారి అన్నా రు. బుధవారం జిల్లాకేంద్రంలోని శివాజీనగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా పరిశీలకుడు వేణుగోపాలాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులకు ప్రతినెలా రూ.వేల కోట్ల వడ్డీలు కడుతూనే ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలన హామీలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటువేసి గెలిపించినందుకు ధన్యవాదాలు చెప్పడానికే ఈ సభలు నిర్వహి స్తున్నామన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలితాలు అందుతున్నాయన్నారు. లబ్ధిపొందనివారు తిరిగి జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తుచేసుకుంటే వెంటనే మంజూరుచేస్తామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరుచేస్తారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇన్ని సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబా ద్ నగరానికి రూ.300 కోట్ల నిధులు వచ్చాయని, వాటితో తాగునీరు, డ్రైనేజీ పనులు చేపడతామన్నా రు. ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పనిచేయాలని, పార్టీకోసం, తమ భవిష్యత్తు కోసం శ్రమించాల న్నారు. రేషన్ కార్డులు త్వరలోనే ఇవ్వనున్నట్లు తెలిపారు. నాయకులు జావేద్ అక్రం, రత్నాకర్, అరూస్‌ఖాన్, ఖుద్దూస్, సంతోష్, రాంభూపాల్‌రెడ్డి, న రేందర్, మల్లేశ్‌యాదవ్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించి ఏడాది పాలన

- గ్యారంటీలు, హామీలను విస్మరించిన కాంగ్రెస్
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్
- కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ విడుదల



సుభాష్‌నగర్: ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలు, గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచించి ఏడాది పాలనను పూర్తి చేసుకుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి, దినేశ్ మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 421 హామీలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆరోపించారు. బోధన్, సారంగాపూర్ చక్కెర పరిశ్రమలను అధికారంలోకి రాగానే తెరిపిస్తామని మాటిచ్చి.. ఇంతవరకూ వాటి ప్రస్తావన లేదన్నారు. జిల్లాలో 2.75లక్షల మంది రైతులు ఉంటే.. కేవలం 70వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇంకా రెండు లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఏడాది గడిచినా ఒక్కరికి కూడా పోడు పట్టా ఇవ్వలేదని, ఆడబిడ్డలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామని చెప్పి విస్మరించిందని విమర్శించారు. ఆస్పత్రులకు ఆరోగ్య శ్రీ బకాయిలు రాక పేదలకు వైద్యఫలాలు అందడంలేదని, ఏడాదిలో రెండు లక్షల నియామకాలు చేపడుతామని చెప్పిందని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తయ్యిందని, రాబోయే రోజుల్లో గ్యారంటీలు, హామీల అమలుకు బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని, ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, నాయకులు ఇప్పకాయల కిశోర్, బద్దం కిషన్, స్వామి యాదవ్, పద్మారెడ్డి, కొండా ఆశన్న, పుట్ట వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోరితే బెదిరిస్తున్నారు



నిరసన తెలుపుతున్న మృతి చెందిన విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులు

బోధన్‌టౌన్(బోధన్): తమ బిడ్డ జశ్విత్ రెడ్డి మృతి చెందాడని ఎమ్మెల్యేని కలిసి న్యాయం కోరితే, జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల యాజమాన్యం కొంత మందిని ఇంటికి పంపించి బెదిరించారని విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బోధన్‌లోని పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిశామని, మరుసటి రోజు జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుండగా కాకతీయ విద్యా సంస్థ తరఫున కొందరు కారులో వచ్చి ఈ విషయం ఇంతటితో వదిలేయాలని బెదిరించినట్లు తెలిపారు. తాము 100 డయల్‌కు ఫోన్ చేయగా పోలీసులు స్టేషన్‌కు తీసుకు వెళ్లారని తెలిపారు. జశ్విత్ రెడ్డి అనారోగ్యానికి గురై రక్తపు వాంతులు చేసుకుంటే పాఠశాల యాజమాన్యం ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు.

కేసు నమోదు

కాకతీయ విద్యాసంస్థకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. కేసు విత్‌డ్రా చేసుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తమను కాకతీయ విద్యాసంస్థకు చెందిన వారు బీఎస్ఆర్ నగర్‌లోని తమకు ఇంటికి వచ్చి బెదిరించినట్లు జశ్విత్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు.

పరామర్శకు వచ్చాం..

మృతి చెందిన తమ పాఠశాల విద్యార్థి జశ్విత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చామని, తాము ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని కాకతీయ విద్యాసంస్థకు చెందిన వారు తెలిపినట్లు సీఐ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిగా రైతు వివరాలు నమోదు

- వర్తించని రుణమాఫీ
- అధికారుల చుట్టూ తిరుగుతున్న వైనం

మాక్లూర్: వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న తనకు రుణమాఫీ వర్తించకపోవడంతో ఆందోళనకు గురైన రైతు.. అధికారుల వద్దకు వెళ్లగా తన వివరాలు ప్రభుత్వ ఉద్యోగిగా నమోదైనట్లు తెలుసుకుని అవాక్కయ్యాడు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు రొద్ద సుమన్‌కు నాలుగు ఎకరాల భూమి ఉంది. డీసీసీబీలో రూ.26,801, ఎస్బీఐలో రూ.1,65,220 రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ చేయగా సుమన్‌కు వర్తించలేదు. ఇదేమిటని అధికారుల వద్దకు వెళ్లి ప్రశ్నించగా అతడి వివరాల్లో ప్రభుత్వ ఉద్యోగిగా నమోదైనట్లు తెలిపారు.

అప్పటి నుంచి తనకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాను నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రైతు సుమన్ వివరాల నమోదులో ఎక్కడో పొరపాటు జరిగిందని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని మండల వ్యవసాయాధికారిణి పద్మ తెలిపారు. రుణమాఫీ కోసం మళ్లీ ప్రతిపాదనలను పంపించామని, సుమన్‌కు రుణమాఫీ వర్తించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

బోరుమోటార్ల కేబుళ్లు చోరీ

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ దుబ్బయానంగుట్ట ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాల్లో దొంగలు హల్‌చల్ సృష్టించారు. మంగళవారం రాత్రి సుమారు వంద బోరుమోటార్ల కేబుళ్లను ఎత్తుకెళ్లారు. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని బోరుమోటార్ల కేబుళ్లను ఎత్తుకెళ్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బుధవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ప్రతి ఏడాది తమకు ఈ పరిస్థితి తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు సుమారు రూ.లక్షా 20వేల విలువైన వైర్లను ఎత్తుకెళ్లారని, పోలీసులు పెట్రోలింగ్ చేయాలని రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఫార్మసిస్ట్ మృతి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఓ ఫార్మసిస్ట్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని భూపుత్రమ్మ కల్యాణ మండపం ఆవరణలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన శిరీష (28) బీఫార్మసీ పూర్తి చేసి కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఆర్‌బీఎస్‌కే విభాగంలో ఫార్మసిస్ట్‌గా కొంతకాలంగా బిచ్కుందలో పనిచేస్తోంది. ఆమె భర్త స్వామి బతుకు తెరువు కోసం కొద్ది రోజుల క్రితం దుబాయికి వెళ్లగా, మామ పోచయ్య, అత్త సుగుణ భూపుత్రమ్మ కల్యాణ మండపంలో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. వారికి అక్కడే కేటాయించిన ఓ గదిలో అందరూ కలిసి ఉంటున్నారు. గత కొంతకాలంగా ఆమెను కొందరు వ్యక్తులు వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగానికి సంబంధించిన విషయంలో వేధింపులు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి సైతం ఈ విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన శాఖపరమైన సమావేశానికి కూడా శిరీష హాజరైంది. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటికి పక్కనే ఉన్న ఓ చిన్న షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గమనించారు. ఘటనా స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. మృతురాలికి ఐదేళ్ల లోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నకిలీ ప్రాక్టీషనర్లపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్ నాగారం: జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు దాడులు చేయడం సరికాదని, నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజశ్రీకి జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సుమారు 2,300 మందికిపైగా ఆర్ఎంపీ, పీఎంపీలు ఉన్నారని, వారంతా ప్రథమ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ చికిత్స అందిస్తున్న ప్రాక్టీషనర్లు ఇటీవల టీఎంసీఎస్ దాడులకు రావడంతో భయపడుతున్నారన్నారు. తాము ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుల్గం మోహన్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వర్మ, కోశాధికారి పోషాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జితేందర్ కూనే, రాములు, సత్యనారాయణ, హన్మాండ్లు, ఆయూబ్, అష్ఫక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సాయం కోసం వస్తే చాటింగ్ మొదలు పెట్టాడు

- యువతితో ఓ సీఐ వాట్సాప్ మెసేజ్‌లు
- ఏడాదిన్నరగా కొనసాగుతున్న వ్యవహారం
- యువకుడిపై అక్రమ కేసు
- సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు



ఖలీల్‌వాడి: సాయం కోసం వచ్చిన యువతితో ఓ సీఐ చనువు పెంచుకుని వాట్సాప్ చాటింగ్ చేయడంతోపాటు అడ్డువచ్చిన యువకుడిపై కేసు నమోదు చేయించిన వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో ఓ యువతి లెక్చరర్‌కు రూ.లక్షన్నర వరకు డబ్బులు ఇచ్చింది. లెక్చరర్ తన డబ్బులను తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో ఓ యువకుడి ద్వారా యువతి సీఐని కలిసి తన సమస్యను తెలిపింది. సీఐ సదరు లెక్చరర్‌ను పలుమార్లు పిలిపించి యువతి ముందే బెదిరించడంతోపాటు కొంత డబ్బును తిరిగి ఇప్పించాడు. ఈ క్రమంలో యువతితో చనువు పెంచుకున్న సీఐ ఆమె మొబైల్ నంబర్ తీసుకుని వాట్సా ప్ చాటింగ్ మొదలుపెట్టాడు. అది ఎంత వరకు వెళ్లిందంటే.. తాను ఉదయం లేచింది మొదలు ఇంట్లో, కార్యాలయంలో ఏం చేస్తున్నది, డ్యూటీలో ఏం చేస్తున్నది ఇలా అన్ని విషయాలు, ఫొటోలు యువతితో షేర్ చేసుకున్నాడు. కూతురు వయస్సున్న యువతితో సీఐ వాట్సాప్ చాటింగ్ చేయడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. డిగ్రీ పూర్తి చేసిన యువతి విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోగా, సీఐ దగ్గరుండి ఎంక్వైరీ పూర్తి చేయించినట్లు ప్రచారంలో ఉంది. ఈ వ్యవహారం తెలిసిన యువకుడు ఎస్బీ కానిస్టేబుల్ సాయంతో అప్పటి సీపీ కల్మేశ్వర్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో సీఐని అప్పటి సీపీ హెచ్చరించారు. సీపీ కార్యాలయం నుంచి బయటికి వచ్చిన యువకుడి వద్ద నుంచి ఎస్బీ కానిస్టేబుల్ ఫోన్ తీసుకుని వాట్సాప్ చాటింగ్, వీడియోలను డిలీట్ చేశారు. ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలేయాలని సూచించాడు. అయితే తనపై సీపీకి ఫిర్యాదు చేసిన యువకుడిపై కక్ష పెంచుకున్న సీఐ ఓ కేసులో అతడిని ఇరికించాడు. ఆ తరువాత బదిలీపై వెళ్లిపోయిన సదరు సీఐ ఇటీవల తిరిగి జిల్లాకు వచ్చాడు. తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని యువకుడు సీఐతోపాటు ఎస్సై, ఓ కానిస్టేబుల్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు.

నేడు బీసీ డెడికేటెడ్ కమిషన్ రాక

నిజామాబాద్‌అర్బన్: బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, సభ్యులు గురువారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లపై ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కమిషన్ సభ్యులు ప్రజాభిప్రాయాలను సేకరిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ కమిషన్‌కు వివిధ సంఘాల వారు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయొచ్చని సూచించారు. అభిప్రాయాలను తెలిపేవారు తమ వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, ఆధారాలను అభ్యర్థనలతో సమర్పించాలని పేర్కొన్నారు.

క్రీడా సమాచారం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 వాలీబాల్ ఎంపికలు నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి 60 మంది బాలురు, 25 మంది బాలికలు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 10 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరిత, జిల్లా కబడ్డీ అసోసియేషన కార్యదర్శి గంగారెడ్డి, రాజ్‌కుమార్, పీఈటీలు యాదగిరి, శ్రీనివాస్, సురేష్, మ .దు, భూపతి,రాజేందర్,అనూష,నిఖిత పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌షిప్‌కు ..



నిజామాబాద్‌నాగారం: కర్నాటక రాష్ట్రంలోని కొడుగు జిల్లాలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ ఫెడరేషన్ కప్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు శశిధర్ (తెలంగాణ పురుషుల జట్టు) శశిధర్ ఎంపికయ్యాడు. జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారుడు శశిధర్ ఎంపికపై తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేశ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి నెట్‌బాల్‌కు ..

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి నెట్‌బాల్‌కు జిల్లాకు చెందిన యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యారు.



యశ్వంత్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు పంజాబ్‌రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి నెట్‌బాల్ టోర్నీలో యశ్వంత్ పాల్గొననున్నాడు. నగరంలోని అభ్యాస స్కూల్‌లో చదువుతున్న యశ్వంత్‌ను కరస్పాండెంట్ చెన్నా అన్నపూర్ణ, ఇన్‌చార్జి మాధవి, పీఈటీ ఆకుల నాగరాజు అభినందించారు.

బేస్ బాల్ సీనియర్ మహిళల జట్టు ..



ఎంపికైన క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్ నళిని

డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల క్రీడామైదానంలో బుధవారం జిల్లా సీనియర్ మహిళల బేస్ బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తీగుళ్ల నళిని మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర బేస్‌బాల్ మహిళల చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలుపాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 6 వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తారని బేస్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. జట్టు ఎంపికలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోత్స్న, శ్రీలత, కోచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మెండోరాలో అగ్ని ప్రమాదం

- కాలిపోయిన ఇల్లు
- రూ.4.5 లక్షల నగదు దహనం



అగ్ని ప్రమాదం జరిగిన ఇల్లు



కాలి బూడిదైన నగదు

బాల్కొండ: మెండోరాలో మంగళవారం సాయంత్రం ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది. ఆ ఇంట్లో నివాసం ఉండే నాలుగు కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. గ్రామానికి చెందిన దేవ మల్లయ్య, మహేందర్, సాయన్న, శ్రీనివాస్ ఒకే ప్రవేశ ద్వారంతో కలిసి ఉన్న ఇంట్లో వేర్వేరుగా నివాసం ఉంటారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు కాలిపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మిద్దెపై గడ్డి ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కాగా దేవమల్లయ్య ఇటీవల గొర్రెలు కొనుగోలు చేశాడు. వాటి కిస్తి కట్టడానికి రూ.4.5 లక్షలు అప్పు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. అగ్ని ప్రమాదంలో ఆ డబ్బు కూడా కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలుశిక్ష

హోటల్ యాజమానికి ఒక రోజు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళలో హోటల్ తెరిచి ఉంచిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఈనెల 2న షేక్ గౌస్‌పాషా అనే వ్యక్తి రాత్రి 10:30 గంటల తర్వాత హోటల్ తెరిచి ఉంచడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజర పర్చామన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కి మూడు రోజులు..

మద్యం మత్తులో అంబులెన్స్ నడుపుతూ పట్టుబడిన డ్రైవర్‌కు న్యాయస్థానం మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఈనెల 2వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తుండగా, అంబులెన్స్‌ను డ్రైవర్ మహ్మద్ ఇసాక్ సైరన్ వేసుకుని అతివేగంగా నడిపాడన్నారు. తాము వెంబడించి అంబులెన్స్‌ను ఆపగా అందులో పేషెంట్ లేరని, డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అంబులెన్స్‌ను సీజ్‌చేసి డ్రైవర్‌ను కోర్టులో హాజర్చగా న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన మరో 14 మందికి రూ.38వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన వ్యక్తికి ఏడు రోజులు..

మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గాంకు చెందిన సాంగి శ్రీధర్ (25)కు న్యాయస్థానం ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. శ్రీధర్ మద్యం సేవించి కొన్ని రోజులుగా చుట్టుపక్కల వారితోపాటు కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగిస్తుండడంతో కేసు నమోదు చేసి, కోర్టులో హాజర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారన్నారు.

దొంగతనం కేసులో ఒకరికి..

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్‌నగర్ తండాలో ఆగస్టులో బదావత్ నరేశ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ కేసులో పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేశ్ అనే వ్యక్తికి ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.